ప్లీజ్ -,

ఒక్క క్షణం!

దయచేసి ఈ పేజీని తిప్పివేయకండి.

ఈ కథ చదవమని అభ్యర్థన కాదు- బలవంతం అంతకన్నా కాదు.

మీ జీవితంలో ఎన్నో కథల్ని చదివే వుంటారు. కథల్లాంటి జీవితాల్ని మరెన్నో చూసే వుంటారు... అయితే! అవన్నీ మీకు గుర్తుండకపోవచ్చు... కాని ఈ కథ ఎక్కువగాతం యీ దేశంలో జరుగుతున్నదే- మీరు నిత్యం చూస్తున్నదే- చాలా యిళ్ళల్లో ఉన్నదే కొందరి జీవితాల్లో ఎదురైందే-!

సామాజిక స్పృహ!

ఈ పదం యిప్పటి సమాజంలో చాలా చులకనై పోయింద. అంతకుమించి చవకబారిపోయింది కూడా.

ఎక్కడుంది సామాజిక స్పృహ-?

ఓ ఆడది గడప దాటినపుడు- ఓ ఆడది దిగజారినపుడు- ఓ ఆడది ఆత్మహత్య చేసుకున్నపుడు- ఓ ఆడది రేప్ చేయబడినపుడు- ఓ ఆడది అవమానించబడినపుడు- ఓ ఆడది కన్నీరు కార్చినపుడు- ఎక్కడ... ఎక్కడ ...ఎక్కడుంది సామాజిక స్పృహ-?

మహాత్ములు- మహాయోధులు- మేధావులు- ఆఖరికి యువతరం తిరగబడదేం-? 'ఇది అన్యాయం' అని యీ లోకాన్ని ప్రశ్నించరే-? గొంతెత్తి బిగ్గరగా అరవరేం-?

ఆదర్శాల ముసుగు కప్పుకొని సామాజిక స్పృహ కోసం వీళ్ళందరూ పాటుబడుతున్నారు- ఆత్మవంచనల్తో బ్రతుకు పోరాటాన్ని సాగిస్తున్నారు.

వీళ్ళందరికోసం కాదీ కథ.

ఇది నా కథ-

ఇంకా ఎందరిదో యీ కథ!

అందుకే మీకు చెబుతున్నాను.

ప్లీజ్ ఫాలో ద స్టోరీ...




నాకీ లోకం గురించి పూర్తిగా తెలియక ముందే, నా వంటి మీదకు వయసు వచ్చేసింది. దాన్తో పాటు యవ్వనం వచ్చేసింద. ఆ కారణంగా నాకు పెళ్ళిచేయాలనుకున్నారు మా వాళ్ళు. అంచేత మా వాళ్ళు వూళ్ళ మీద తిరిగారు, నాకో మొగుడు కోసం.

చాలా త్వరగానే దొరికాడు నా మొగుడు. ఎందుకంటే కట్న కానుకలు ఎక్కువగానే యిస్తావన్నారు కనుక -

అన్నారే కాని మా వాళ్ళు ఎక్కువ యివ్వలేదు.

# కౌలెప్పు శివశేఖర్

# 'పురోగమనం'

నా పెళ్ళి ఆగిపోతుందనుకున్నారు చాలా మంది.

ఎందుచేతనో మరి ఆగలేదు.


పెళ్ళి జరిగిపోయింది.

శోభనం జరిగిపోయింది.

కానీ—.

కాపురం మాత్రం జరగలేదు.

మళ్ళీ మా వాళ్ళు వూళ్ళ మీద పడ్డారు— అంటే నాకు మరో మొగుడ్ని తేవడానికి కాదు... కట్టుకున్న మొగుడుతో నా కాపురం



జరగడానికి... అది జరగాలంటే డబ్బు కావాలి... అందుకే వూళ్ళ మీద పడ్డారు.

శోభనం నాడు నా మీద విపరీతమైన ప్రేమను కురిపించేసిన నా మొగుడు- ఆ తర్వాత తన ప్రేమను వుత్తరాల ద్వారా కురిపించేస్తాడనుకున్నాను. —కురిపించలేదు సరి కదా, ఓ సారన్నా నా వేపు తొంగి చూడలేదు.

ఆర్నెల్లి తర్వాత-

మా నాన్న ముసలివాడై పోయాడు, ఆయన నడుం వంగిపోయింది. వంట్లో. నెత్తురు యింకిపోయింది. చర్మం ఎండిపోయింది. జుట్టు చాలా భాగం నల్లగా వున్నా, అప్పులిచ్చే వాళ్ళ దగ్గరకు వెళ్ళి తెల్లరంగు పూయించుకొని మరీ వచ్చాడు.

ఆడపిల్లల్ని కన్న మధ్య తరగతి తల్లిదండ్రులు త్వరగా ముసలివాళ్ళై పోతారని ప్రత్యక్షంగా తెల్సుకున్నాను...

ఆపై బండెడు సామానుతో, పది వేల రూపాయల్తో మా నాన్న నన్ను అత్తారింటికి తీసుకొచ్చాడు.

ఆ బండెడు సామాను చూడగానే మా అత్తగారి మొహం వెలిగిపోయింది. బహుశ ఆ బండి కూడా యిచ్చేస్తారనే ఆశ కామోలు!

మా ఆడపడచులు టన్నుల కొలది ఆప్యాయతలను వొలకబోశారు. తోడి కోడళ్లు పౌన్ల కొలది అభిమానాన్ని కుమ్మరించారు.

మా వారు మాత్రం నా మీద ప్రేమ కురిపించనా- వద్దా- అనే సందిగ్ధంతో తల్లి వేపు చూస్తుండిపోయారు...

"అన్నీ బాగానే వున్నాయ్ అన్నయ్యగారు కానీ- కట్నం తాలూకు సొమ్ము మరో పది వేలన్నా రావాలి" అంది మా అత్తగారు...

"పది వేలా!" మా నాన్న గుండెల్లో రాయి పడింది.

"అవును మరి! ఈ ఆర్నెల్ల పాటు, యీ పదివేలకు వడ్డీ మరియు యీ మధ్య కాలంలో నాలుగు పండగలు వచ్చాయి గదా! వాటి తాలూకూ కానుకలు మావాడికి మీరు ఎలానూ ఇవ్వాల్సి వుంది. మొత్తం మీద ఆ పదివేలు కూడా ఇప్పించేస్తే మీ పిల్ల కాపురానికేం ముప్పులేదు. నా బిడ్డలా చూసుకుంటానంటే నమ్మండి."

మా నాన్న మాట్లాడలేకపోయాడు.

తెల్లబడిన మా నాన్న జుట్టు యీ సారి రాలిపోవడం ఖాయం... సాంతం రాలి బట్టబుర్ర అయ్యేకంటే- ఇప్పుడే గుండు గొరించి ఆయన్ని ఇంటికి పంపేయడం మంచిది.

ఇది అన్యాయం అని అక్కడున్న వారెవరూ అనలేదు. మా వారు కూడా అడగలేదు.

చివరికి వాళ్ళు కోరిన పదివేలు ఇవ్వడానికి వొప్పుకున్నాడు మా నాన్న. వొప్పుకోకపోతే నన్ను వెంటనే ఆయన వెంట పంపించేద్దురేమో!

ఆ తర్వాత-నా కాపురం...రోజూ మూడు వందల తిట్లతో ఆరు వందల చివాట్లతో సాగిపోయేది.

తల్లి మాటలకు ఎదురుచెప్పరు మావారు. పెళ్ళానికి ఎదురు తిరగరు మా మావగారు.ఇక మిగిలిన జనం ఎదురు పడటమే అరుదు.

మరో మూడ్నెల్లు గడిచి పోయాయి..

మా అత్తగారు నన్ను కన్నబిడ్డలానే చూసుకుంది.. మావారు నన్ను పెళ్లాం లానే చూసుకున్నారు.. ఎవరైనా నన్ను ప్రశ్నిస్తే నేను అలానే చెబుతాను.

ఎందుకంటే-?

(తరువాయి 27వ పేజీలో)

## అవకాశం

"టక్...టక్...టక్"

"ఎవరది?"

"అవకాశాన్ని"

"పిచ్చివాగుడు! అవకాశం ఒకే సారి తడుతుంది."

( 9వ పేజీ తరువాయి )

మా అత్తగారు ప్రేమతో నన్ను చీపుర్లతో కొట్టిన దెబ్బలు- నా శరీరంపై ఏర్పడిన గాయాలు- రాత్రులందు నా పట్ల ప్రేమ ఎక్కువై మా వారు సిగరెట్స్‌తో నా వంటిపై సరదాకి పెట్టిన మచ్చలు- అంతకంటే ఎక్కువగా నా అంతరంగంలో ఏర్పడిన గాయాలు- మచ్చలు, వాటిని నేను ఎవరికీ చూపించుకోలేను కనుక!

నేను ఏడిస్తే మా వారు కూడా ఏడ్చేవారు ఆనందంగా, నేను బాధపడ్తుంటే మా మావగారు చిద్విలాసంగా నవ్వుకొనేవారు. నేను దిగులుగా వుంటే మా ఆడపడచులు కేరింతలాడేవారు,, నేను విచారంగా వుంటే మా తోటికోడళ్ళు ముసి ముసిగా బుగ్గలు నొక్కుకొనేవారు.

ఓ నాడు మా అమ్మా నాన్న వచ్చారు నన్ను చూడ్డానికి.

నా కాపురం చూసి తెగ సంబర పడిపోయారు.

బాధ ఎక్కువై గుండెలు బాదుకోలేక- జుట్టు పీక్కోలేక- ఏడ్వడం చేతకాక-వచ్చిన వెంటనే తిరిగెళ్ళి పోయారు. బహుశా! మా వూరెళ్ళి తీరిగ్గా ఏడుస్తారేమో వాళ్ళు-!

ఇలా వుత్తచేతుల్తో మా వాళ్ళు రావడం బొత్తిగా నచ్చలేదు వీళ్ళకి. ఆ రాత్రి మరి కొన్ని మచ్చలు తేలాయి నా వంటిమీద. మా నాన్న ఆ డబ్బు యివ్వకపోతే మా వారు నన్ను వదిలేస్తామన్నారు.

ఆ తెల్లారి- "మరికొన్ని రోజుల్లోనే మావాడికిమరోపెళ్ళిచేస్తాను. మరోపిల్లనువాడికి చూపించక ముందే- మీ నాన్నను త్వరగా డబ్బు తెమ్మను" అంది మా అత్తగారు...

చాలా భయపడిపోయాను.

అసలు ఓ మగాడంటూ తోడులేని ఆడదానికి విలువేలేదు.

ఉమిసిన కిళ్ళీ మరకలకి-చింపి పారేసిన కాగితాలకి-విసిరేసిన అరటి తొక్కకి ఉన్న విలువ ఈ పుణ్యభూమిలో ఆడదానికిలేదు. అందుకే వెంటనే మా నాన్నకి లెటర్ రాసాను.

నెలరోజులు గడిచినా-నాన్న నుంచి సమాధానం లేదు.

ఆయన మాత్రం ఎక్కణ్నుంచి డబ్బు తెస్తాడు... నాతర్వాత పెళ్ళి చేయవలసిన మరో ఆడపిల్ల ఉంది. దానికి ఓ మొగుడ్ని కొనాలి. దాన్ని అత్తవారింటికి పంపాలి.

ఓ సాయంత్రం వేళ మా మావగారు నా గదిలోకి వచ్చారు. అప్పటికింకా మావారు ఇంటికి చేరలేదు.

"అమ్మాయ్! నీవెప్పుడైనా చలంగారి పుస్తకాలు చదివేవా?" అని అడిగారాయన.

"ఆయన పుస్తకాలు కూడా రాస్తారా... నాకు తెలీదే? కానీ-ఆయన నటించిన సిన్మాలు చాలా చూశాను" అన్నాను.

"అయ్యో పిచ్చితల్లి! నీకు అసలు పుస్తక జ్ఞానం లేనట్లుందే... చలంగారంటే ఈ దేశంలో గర్వించదగ్గ రచయిత... అంతేగానీ ఆయన సిన్మా నటుడు కాదమ్మా. ఆయన రచనల్లో నీలానే చాలామంది ఆడవాళ్ళు బాధలు పడినవారే. నీ సమస్యకు పరిష్కారం నేచూపించలేనుగానీ, ఆయన నవల్స్ చదువు నీకేమైనా పరిష్కారం గోచరిస్తుందేమో" అనేసి మావగారు వెళ్ళిపోయారు.

నా జీవితం ఓ మలుపు తిరగడానికి మావగారే కారణం...!

ఓసారి ఆయన్ని అడిగాను—"మీరిన్ని గొప్ప కబుర్లు చెబుతారుకదా—మరి అత్తగార్ని ఎందుకు ఎదిరించలేకపోతున్నారు?"

"ముసలివాడ్ని-ఏ సంపాదన లేనివాడ్ని- నేను సంపాదించిందంతా దానిపేర్నే ఉంది... అది డబ్బులో పుట్టి డబ్బులో పెరిగింది అందుకే దానికంత అహంభావం."

"మీ మంచితనం మీకు పుట్టిన బిడ్డల్లో ఏ ఒక్కరికీ రాలేదెందుకని...?"

రోజులు గడిచిపోతున్నాయ్.

నాన్న డబ్బు తీసుకురావడంలేదు.

ఈమధ్య కాలంలో ప్రపంచాన్ని నేను బాగా చదవగలుగుతున్నా- జీవితమంటే ఏమిటో ఇప్పుడిప్పుడే అర్థం చేసుకోగలుగుతున్నా. ఎన్నో కొత్త విషయాల్ని తెల్సుకోగలుగుతున్నా-

ఓ రాత్రివేళ మా వారు నన్ను బెల్టుతో కొట్టారు. ఎవ్వరూ అడ్డురాలేదు.

ఆడదాన్ని కొట్టే హక్కు మగవాడికి వున్నప్పుడు- మగవాడ్ని కొట్టే హక్కు ఆడదాని క్కూడా వుంటుందేమో-!

ఒక్కసారి ఆడది తిరగబడితే-?

లేదు- అలా జరగాలంటే మరో శతాబ్దం గడవాలి.

"మరోసారి ఎప్పుడూ ఇటువంటి బూతు పుస్తకాలు చదవొద్దు" అనేసి చలం మైదానం నవల్‌ని నా మొహం కేసి విసిరికొట్టారు మా వారు.

నేనిన్ని దెబ్బలు తినడానికి కారణం— ఆ పుస్తకమే... అయినా బాధలేదు. ఇంకా ఎన్ని దెబ్బలైనా భరించగల్ను— కానీ, 'మైదానాన్ని' బూతు పుస్తకం అన్నందుకే బాధ పడ్తున్నా—

ఆ రాత్రంతా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాను.

ఆ నిర్ణయం ప్రకారం— తెల్లారి...

"నే వెళ్తున్నా" అన్నాను సూట్‌కేస్ పట్టుకొని.



"ఎక్కడికి?" మా అత్తగారు విస్మయంగా అంది.

"పుట్టింటికి"

"ఎందుకు" మా వారు ఆశ్చర్యంగా అడిగారు.

"మీక్కావలసింది డబ్బు- ఆ డబ్బు కోసమే వెళ్తున్నా"

"ఆహా! ఎంత కాలానికి నీకు మంచి బుద్ధి పుట్టిందే... త్వరగా పట్టాతల్లి"

నేను ముందుకు నడిచాను.

మా వారి మొహంలో విచారం తొంగి చూస్తోంది... ఎందుకంటే ఆయన తిట్టడానికి మరియు పక్కలో పడుకోడానికి నా లాంటి ఆడది ఆ ఇంట్లో, ఇకలేదు మరి!

కిరాయికి వచ్చే ఆడవాళ్ళు చాల మంచి వున్నా వాళ్ల బెల్టు దెబ్బల్ని, సిగరెట్ మచ్చల్ని భరించరు— అంటే, ఈ నాడు భర్తల చాటున వున్న కొందరు ఆడవాళ్ల వేశ్యల కన్నా చాల ఘోరంగా హింసింపబడ్తున్నారు.

తెగించి ఇంట్లోంచి బయటకు వచ్చేశాను.

ఎక్కడికి వెళ్ళాలి —?

పుట్టింటికా? ఏట్లోకా?

లేదు- చావకూడదు.

సమస్యలకి దూరంగా పరిగెడితే అవి వెన్నంటి వస్తూనే వుంటాయి. ఎదురు తిరగాలి- ఎదురోడ్డాలి'

చివరికి పుట్టింటికి చేరుకున్నాను.

నన్ను చూసి మా వాళ్ళు బావురుమన్నారు నేనూ బావురు మన్నాను... మొత్తానికి పరస్పరం తృప్తిగానే ఏడ్చుకున్నాం.

తీరిగ్గా- మా నాన్నకు నా పరిస్థితి వివరించాను.

అప్పటికే ఆయన జుట్టు పూర్తిగా రాలిపోయింది. ఇక రాలడానికి ఆయన తలకాయ ఒక్కటే మిగులుంది.

"ఈ తలను పట్టుకెళ్ళి ఎక్కడైనా తాకట్టు పెట్టుకొని- నీ కాపురాన్ని చక్కబెట్టుకోమ్మా" అన్నాడాయన.

"మీ తలపోతే—నా మంగళసూత్రం గతేంకాను" అంటూ మా అమ్మ వాపోయింది.

"నీ మంగళ సూత్రం నాకిచ్చేయ్ అమ్మా! ఎదురింటి అత్తరు సాయిబుతో నా మెడలో కట్టించేసుకుంటాను" అంది మా చెల్లాయ్ ఎంతో ఆశతో.

మా అమ్మ దాన్ని పట్టుకొని మరోసారి గొల్లుమంది.

చాలరోజులు గడిచిపోయాయ్- పరిస్థితులు చాలవరకూ అదుపుతప్పిపోయాయ్... ఓ విధంగా మా జీవితాలే మారిపోయాయ్.

మా చెల్లాయ్ బ్రతుకు 'అత్తరై' పోయింది...నా బ్రతుకు 'మురికై' పోయింది. నాన్న బ్రతుకు 'మోడై' పోయింది...అమ్మ బ్రతుకు 'మొండై' పోయింది.

ఆ మధ్య కాలంలో—

"మురికిగుంట పక్క గులాబీలు కూడా పూస్తాయ్" అన్నాడు శంకరం. శంకరంతో నా పరిచయం కొన్నిరోజుల పాతదిమాత్రమె

అతని మంచితనానికి చలించిపోయాను. అతని మాటలకు కరిగిపోయాను. ఆ విశాల హృదయానికి మోకరిల్లి పోయాను.

అతని మంచితనాన్ని-ఔదార్యాన్ని భరించలేక శంకరం భార్య ఎవడితోనో లేచిపోయిందట... అయినా అతడు యింకా ఆమెనే ఆరాధిస్తున్నాడు.


కన్నతల్లినే పెళ్లయిందా అని ప్రశ్నించిన కూతురు కథ



"మొదటిసారి ఏర్పడిన ప్రేమ—జీవితాంతం స్థిరంగానే ఉండాలి" అని అంటూ ఉంటాడతను.

నాముందు ఎన్నోసార్లు కన్నీళ్ళు పెట్టుకున్నాడు... చిన్నపిల్లాడిలా రోదించాడు- పిచ్చివాడిలా నవ్వేడు.

అతని కథంతా నాకు చెప్పాడు.

నేనూ—నా కథంతా శంకరానికి చెప్పుకున్నాను... వెక్కి-వెక్కి ఏడ్చాను. ఏడ్చిన ప్రతిసారి అతడు నన్ను వోదార్చాడు.

అతడు పరిచయమైన కొద్దిరోజుల్లోనే నాలో ఉత్సాహాన్ని నింపేశాడు. ఏదో చైతన్యం నాలో ఆపహింపచేశాడు.

నా కాపురం నిలబెడతానన్నాడు.

పొంగిపోయాను...

నాక్కావల్సినంత డబ్బిస్తానన్నాడు.

ఆనందపడ్డాను.

నేను అత్తవారింటికి వెళ్ళిపోయాక-అతడు నాకు కన్పించనన్నాడు.

నీర్సపడిపోయాను...

మరికొన్ని రోజులు తర్వాత—

నేనూ—శంకరం మా అత్తారింటికి బయల్దేరాం—

అక్కడికి వెళ్ళాలంటే ఎందుకో నాకు భయంగా ఉంది.

అత్తవారింట్లో శంకరాన్ని అందరికి పరిచయం చేశాను...నా 'కజిన్'గా...

"ఇన్ని రోజులు ఉండిపోయావే?" మా అత్తగారు గద్దించి అడిగింది.

"డబ్బు దొరకలేదు" అన్నాను చిన్నగా.

ఆవిడకు డబ్బు ముఖ్యం...కోడలు ఎంత ఎక్కువ కట్నంతెస్తే అంత గొప్ప... పెళ్ళి చూపులపుడు వరకట్నం గురించి ముందుగా నోరు తెరిచేది ఇటువంటి అత్తలే!

వరకట్నం దురాచారం- వరకట్నాన్ని నిషేధించాలి- అని గొంతెత్తి అరిస్తే సరిపోదు- ఈ యువతరం చేయవలసిన మొదటి పని తల్లితండ్రుల్లో మార్పు తీసుకురావటం- అంతకంటే ముందుగా చేయవలసింది వరకట్నాన్ని అసహ్యించుకోవడం.

ఆ మార్పు వస్తుందా...?

"నా ఒక్కో కోడలు యాభై వేలు పట్టుకొచ్చింది- మీరు బీదవారు కనుక ఆ మాత్రం దయతో నిన్ను మా వాడికి కట్టబెట్టాను....."

అందుకే ఎందరో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు... మరెందరో యువతులు హత్యలు చేయబడుతున్నారు... రోజూ పేపర్లలో యీవార్తలే ప్రచురింపబడ్తున్నాయ్

అయినా యీ జనంలో చైతన్యం లేదు. చీము నెత్తుర్లు లేవు సామాజిక స్పృహ అంతకన్నా లేదు.

ఆ తిరుగుబాటు వస్తుందా ?

"ఇకనైనా బుద్ధిగా వుండి కాపురం చేయ్. ఇంతకీ ఎంత తెచ్చావ్"

"పాతికవేలు"

నిశ్శబ్దం-

ఒక్కసారిగా మతులుపోయినట్లు-అందరూ నా వేపు చూస్తుండిపోయారు.

మా మావగారు తనకేం పట్టనట్లు ఆ మూల కూర్చొని ఏదో పుస్తకం చదువుకుంటున్నారు.

"నిజం! ఏదీ... ఆ డబ్బుయేది..." తేరుకుని మా అత్తగారు అంది.

## పెద్ద ఇబ్బందేం కాదు లెండి

"ఏమిటండీ ఓనరుగారూ! మా గది పైకప్పు 'లీక్' అయి నీళ్ళు కారుతోంది. ఎప్పుడూ ఇంతేనా?"

"అబ్బే లేదండీ! ఎప్పుడయినా వర్షం వచ్చినప్పుడే లీక్ అవుతుంది! మిగతా అప్పుడు ఏమీ ఇబ్బందుండదు!"

శంకరం బ్రీఫ్‌కేస్ లోంచి డబ్బు తీసి టీపాయ్ మీదుంచాడు.

మా అత్తకారు ఆతృతగా ఆ డబ్బు తీసుకోబోయింది.

"ఆగు" పెద్దగా గావు కేకవేశాను.

నా అరుపుకి ఆ గది గోడలు దద్దరిల్లిపోయాయ్.

మామావగారు మాత్రం ఆదిరి పడనూలేదు తల ఎత్తనూలేదు.

"ఆ డబ్బు ఎలా సంపాదించానో- ఎక్కణ్నుంచి తెచ్చానో అడగరేం ?"

"అడగడం ఎందుకు- మీ నాన్న యిచ్చుంటాడు"

"మా నాన్న ఎలా యిస్తాడు"

"ఏవుంది- వున్న యిల్లు కాస్త అమ్మేసుంటాడు"

"అవతలి వాళ్ళు సర్వబికారులై పోయినా పర్వాలేదు- మీకు మాత్రం డబ్బు కావాలి వాళ్ళు పస్తులతో చస్తున్నా పర్వాలేదు, మీకు కట్నాలు కావాలి. మీ కోడళ్ళు దండిగా కానుకలు తేవాలి యిదేనా మీ మానవత్వం ?"

"అమ్మా! ఇది నా పెళ్ళామేనా?" మావారు అన్నారు.

"నీ పెళ్లాన్నే- ఏం అనుమానంగావుందా? నీవు కొట్టిన దెబ్బలు- నీవు పెట్టిన మచ్చలు యింకా నా వంటిమీద మిగిలే వున్నాయ్... తల్లికి భయపడి ఎంతకాలం కాపురం చేయగలవ్? పెళ్లాం పక్కలో పడుకోటానికి అమ్మ అనుమతి కావాలి నీకు. ఛీ.. నీకు సిగ్గులేదు... నీవు మగపుట్టుక పుట్టినందుకు నీ సాటి మగాళ్ళు అవమానంతో కుచించుకుపోవాలి. గుండుగొరిగించుకొని వూరేగాలి... గోచీలు పెట్టుకొని గాడిదలు ఎక్కాలి."

"అమ్మా! నన్ను తిడుతుందే"



**అభ్యంతరంలేదు**

ఓ ముద్దుకృష్ణ తన ప్రియురాలు కామేశ్వరితో షికారు వెళ్తోంటే అక్కడ ఓ ఆవు తన సాధుమూర్తి నాకుతూ కనిపించింది.

"ఆ ఆవు ఏం చేస్తోందో చూశావా? నాకూ అలా ముద్దు పెట్టుకోవాలని వుందోయ్?" అన్నాడతను ఆమె పెదాలవంక ఆశగా చూస్తూ.

"వెళ్ళి ముద్దుపెట్టుకురా! ఆవు పొడిచేలే! ఎవ్వరూ ఏ అనరు!" అంది కామేశ్వరి.

"ఆ డబ్బు చూసయినా కొంచెం వోర్చుకోరా...

"అవును! మీరెప్పుడు నా మాటకు ఎదురు చెప్పలేరు...సరే! ఇకనైనా కాపురం చేయనిస్తారా?"

"నిక్షేపంలా- నీ జోలికి యిక నేను చస్తే రాను" అత్తగారు లెంపలేసుకుంటూ అంది.

"నిన్ను యింకెప్పుడు కొట్టను నన్ను నమ్ము" మా వారు అన్నారు.

"మీకివ్వాల్సినది పదివేలేగా-?

"ఎంతయితే ఏమ్మా!అంతా నీ సొమ్మేగా" మిగతా సొమ్ము నేను తీసేసుకుంటాననే భయంతో అంది అత్తగారు...

"అందులో ఒక్క పైసా నా కక్కర్లేదు... కానీ- ఆ డబ్బు ఎలా సంపాదించానో నన్ను చెప్పనీయండి"

రెండు నిమిషాలు నిశ్శబ్దం-

"నేను ఎంత అందంగా వుంటానో నాకు తెల్సు... అప్పులపాలై పోయిన మా కుటుంబం కోసం–చెదిరిపోయిన నా కాపురాన్ని చక్కదిద్దుకోవడం కోసం...నేను...నేను దిగజారి పోయాను"

వాళ్ళందరూ అయోమయంగా నా వేపు చూశారు.

"మీకింకా అర్థం కాలేదా- నా స్త్రీత్వాన్ని పదిమంది మగాళ్ళకు అమ్ముకొని- ఆ డబ్బు కూడబెట్టాను..."

మా అత్తగారు గుండెలు బాదుకోబోయింది

"ఇప్పటికైనా కళ్ళు తెరవండి...ఇంకా నా లాంటి ఆడవాళ్ళు దిగజారకముందే- పతనం కాకముందే రక్షించుకోండి... రేపు మీ కూతుళ్ళకీ యిదేగతి పట్టొచ్చు."

ఎవ్వరూ మాట్లాడలేదు.

"మీక్కావలసింది డబ్బే గా... దాన్ని ఎలాగోలా మీకు సంపాదించి పెట్టాను... ఇక నన్ను కాపురం చేయనిస్తారా-?"

"ఎంతకు తెగించేశావే... ఫో... తక్షణం యిక్కణ్నుంచిపో..." మా అత్తగారు పెద్దగా అరిచేసింది.

శంకరం నావేపు ఆశ్చర్యంగాచూస్తున్నాడు.

ఇంత జరిగినా మా మావగారు తలెత్తి చూడలేదు.

ఈ యింటితో యిక నాకు బంధం తీరిపోయింది. నాకు విముక్తి లభించింది. మళ్ళీ జన్మంటూ వుంటే యిటువంటి అత్తకు కోడలిగా అటువంటి మొగుడికి భార్యగానే పుట్టకూడదు... అసలు ఆడదానిగానే పుట్టకూడదు...

టీపాయ్ మీదున్న డబ్బు కట్టల్ని చేతుల్లోకి తీసుకోబోయాను.

"అవి తీస్తావెందుకు... ఆ సొమ్ము మీ నాన్న మాకివ్వాల్సిన కట్నం" అరుస్తూ అత్తగారు నాకు అడ్డు రాబోయింది...

అంతే-!

'చెళ్' మని అత్త చెంప వాయించేశాను.

అదే క్షణంలో మావ గారు తలెత్తి నావేపు చూశారు. ఆయన కళ్ళలో కనిపించిన ఆశ్చర్యం... ఆ వెనుకే ఆనందపు మెరుపుల్ని నే చూడగలిగాను.

డబ్బు తీసుకొని శంకరానికి అందించాను.

ఓ సారి ఆ యింట్లోవున్న మనుషుల్ని చూశాను.

గిరుక్కున వెనుదిరిగి పోయాను ..

మౌనంగా నా ప్రక్కనే నడుస్తున్నాడు శంకరం.

చాలసేపటివరకు ఎవరం మాట్లాడుకోలేదు. ఎప్పటికో శంకరం అన్నాడు- "ఎందుకు నీ గురించి తప్పుగా చెప్తున్నావో నాకర్థం కాలేదు... పవిత్రంగా యింతకాలం వుండి ఎందుకు నీకు నీవే కళంకాన్ని పూసుకున్నావో నేను వూహించలేక పోతున్నాను... ఏదో విధంగా నీ కాపురాన్ని నిలబెట్టాలనే ఆశతో యింత దూరం వచ్చాను. ఈ డబ్బు నాకో లెక్కగాదు... ఈ చిన్న మొత్తంతో ఓ ఆడదాని జీవితం నిలబడుతుందనే తృప్తి నాకు మిగులు తుందేమో అనుకున్నాను... నీకు నీవే నీకాపురం కూల్చుకున్నావేమో... ఆలోచించు..."

ఎప్పుడో ఆలోచించేసుకున్నాను–

శంకరం మాటలకు సమాధానంగా– అతని చేయి అందిపుచ్చుకున్నాను...

జీవితంలో మొదటిసారిగా ఓ పరాయి మగాడి చేయి అందుకున్నాను...

ఇప్పుడు శంకరం నాకు పరాయివాడు కాదు.

అందుకే అతని వెంట నడుస్తున్నాను... మరో కొత్త జీవితం ప్రారంభించడానికి—!

*


సినీతారలు

మీరు మెచ్చే ఒక నటి, నటుడి ఫోటోసెట్ 5 రూ. మీకు నచ్చే నలుగురు తారల సెక్సీ ఫోటోసెట్ 10 రూ. కావలసినవారు ఎమ్. ఓ చేయండి. వెంటనే ఫోటోలతోపాటు నటీనటుల, దర్శకుల అడ్రస్‌లున్న పుస్తకంకూడా పంపబడును.

వె. కె. మూర్తి
దాసరివారి వీధి, విజయవాడ-2